

జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఏకాదశి శోభ

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గంటల తరబడి లైన్లలో నిల్చొని, ప్రత్యేక పూజలు చేశారు. మహబూబ్‌నగర్‌లోని కాటన్‌మిల్ వేంకటేశ్వర స్వామి ఆలయం కిటకిటలాడింది. చిన్నచింతకుంట మండలం అమ్మపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో, జడ్చర్ల మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమూర్తి ఆలయం వద్ద గోవింద నామస్మరణ మారుమోగింది.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



నారాయణపేట బాలాజీ మందిర్‌లో హారతి ఇస్తున్న అర్చకుడు



మహబూబ్‌నగర్‌లోని కాటన్ మిల్లు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



కురుమూర్తి వేంకటేశ్వర ఆలయంలో లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు



పాలమూరులో మొక్కుతున్న భక్తురాలు



భక్తులకు తులసి దళాలు ఇస్తున్న అర్చకుడు

మూడేళ్లుగా.. ప్రదక్షిణలు



ఎంసీహెచ్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అనే చందంగా తయారైంది మహబూబ్‌నగర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల దుస్థితి. ప్రభుత్వం నర్సింగ్ కళాశాలను మంజూరు చేసి, భవన నిర్మాణానికి నిధులు కూడా కేటాయించింది. 15 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలో చూపించాలని ఆదేశించింది. మూడేళ్లుగా కళాశాల ప్రిన్సిపాళ్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోవడం లేదు. మెడికల్ కళాశాల, టీఎస్ఎంఎస్ఐడీసీ, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తుండగా, తాత్కాలిక భవనంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- మహబూబ్‌నగర్ (వైద్య విభాగం)

- నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి 15 ఎకరాల స్థలం ఇవ్వాలన్న ప్రభుత్వం
- మెడికల్ కళాశాల ప్రాంగణంలో చూపాలని ఆదేశం
- కలెక్టర్ చెప్పినా సర్వే చేసి ఇవ్వని అధికారులు
- మహిళా అధికారులని చులకనగా చూస్తున్న ఆఫీసర్లు
- భవన నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు

మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రభుత్వం నర్సింగ్ కళాశాలను మంజూరు చేసి, నిధులు కేటాయించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు. ప్రభుత్వం జిల్లాకు 2022 నవంబరు 30న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంజూరు చేసింది. కొత్త భవన నిర్మాణాలకు రూ.40 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో 15 ఎకరాల స్థలం కూడా ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

కలెక్టర్ ఆదేశించినా..

ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ ప్రజావాణిలో ఇప్పటి కలెక్టర్‌కు పరిస్థితిని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సర్వే చేసి ముందుగా 5 ఎకరాలు హద్దులు నిర్ణయించి ఇవ్వాలని సూచించారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, టీఎస్ఎంఎస్ఐడీసీ, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కాని అది అక్కడే ఆగిపోయింది.

మహిళా అధికారులని చులకన..

కళాశాల భవన నిర్మాణం కోసం అధికారులను కలిసేందుకు వెళ్లినపుడు చులకనగా చూస్తున్నారని ప్రిన్సిపాల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఉన్నతాధికారి 'మీకెందుకు అంత తొందర?.. మీరు కట్టుకుంటారా?.. కట్టిస్తారులే.. ఎందుకు మమ్మల్ని విసిగిస్తారు?' అని చీదరింపు మాటలు మాట్లాడుతున్నారని వాపోతున్నారు.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

కళాశాల భవనానికి స్థలం చూపించాలని మొదటి ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి అధికారుల చుట్టూ తిరిగారు. ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగితే ఇప్పుడు, అప్పుడు అంటూ చెప్పుకుంటూ వచ్చారు. నిర్మాణాలు చేపట్టాలని టీఎస్ఎంఎస్ఐడీసీ(ఆస్పత్రుల మౌలిక సదుపాయాల సంస్థ) అధికారుల చుట్టూ తిరిగారు. వారు కూడా టెండర్లు వేస్తున్నాం.. ఇప్పుడు అప్పుడూ అంటూ తిప్పారు. కానీ ఫలితం లేకుండా పోయింది. తాజాగా వచ్చిన మరో ప్రిన్సిపాల్ కూడా ఇదే తరహాలో అధికారుల చుట్టూ తిరిగినా, కొలిక్కి రాలేదు.

కుదరని సయోధ్య

నర్సింగ్ కళాశాలకు ముందుగా 15 ఎకరాలను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో కేటాయించారు. అయితే మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఎలాంటి నర్సింగ్ కళాశాలలు ఉండొద్దని కళాశాల డైరెక్టర్ వ్యతిరేకించారు. దీంతో కళాశాల పక్కన ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలం 5 ఎకరాలు చూపించారు. సర్వే చేయడానికి సర్వే, రెవెన్యూ అధికారులు స్థలానికి వెళ్లారు. కానీ టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు ఆ స్థలం భవన నిర్మాణానికి అనువుగా లేదని, వేరే చోట చూపించాలని సూచించారు. అందుకు రెవెన్యూ అధికారులు మరో స్థలాన్ని చూపించారు. ఆ స్థలాన్ని సర్వే చేసి మార్కు వేయాలి. కాని అధికారులు ముందుకు రావడం లేదు.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనంలో తాత్కాలికంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 3వ బ్యాచు కొనసాగుతోంది. బ్యాచుకు 60 మంది చొప్పున 180 మంది నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇరుకు గదులు, చాలీ చాలని హాస్టల్ భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ భవనాన్ని 120 మందికి కేటాయించగా, ఒక్కో గదిలో నలుగురు నుంచి ఐదుగురు చొప్పున ఉన్నారు. మిగతా 60 మంది ఉండానికి గదులు లేక బయట అద్దె గదుల్లో ఉండి కళాశాలకు వస్తున్నారు. ఈ ఏడాది నవంబరులో మరో బ్యాచు 60 మంది వస్తే భవనాలు సరిపోవు. మరోవైపు ఆస్పత్రి నుంచి కళాశాలను ఖాళీ చేయాలని చెబుతుండటంతో ఏం చేయాలోనని ఆందోళన చెందుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి

మహిళలమై ఉండి కూడా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఎక్కడికి వెళ్లినా మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కళాశాల భవనానికి స్థలం సర్వే చేయించాలి. టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు తొందరగా టెండర్లు వేసి నిర్మాణాలు ప్రారంభించాలి. ప్రస్తుతం అరకొర వసతుల నడుమ నర్సింగ్ విద్యను కొనసాగిస్తున్నాము. ల్యాబ్‌లు, పరీక్షలకు చాలా ఇబ్బంది అవుతుంది. కలెక్టర్ స్పందించి కళాశాల భవన నిర్మాణాలను వేగవంతం చేయించాలి.

- హన్సీ రమావత్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల





ఊట్కూర్‌లో మొహర్రం వేడుకల్లో వేలాదిగా పాల్గొన్న భక్తులు

ముగిసిన మొహర్రం

- ఊట్కూర్, కోయిలకొండలలో ఘనంగా వేడుకలు
- తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలొచ్చిన భక్తులు
- జనసంద్రంగా మారిన ఊట్కూర్
- పీర్లను దర్శించుకున్న రాజకీయ నాయకులు
- భారీ బందోబస్తు

నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్, కోయిలకొండలలో మొహర్రం ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలొచ్చారు. ఊట్కూర్‌లో హసన్, హుస్సేన్ పీర్ల ఊరేగింపు, పీర్లు ఎత్తేవారి కుటుంబంలో పుట్టే మగ శిశువును ఊయలలో వేసే కార్యక్రమాలు, కోయిలకొండలో బీబీ ఫాతిమా పీరు భర్త మరణవార్త చెవులతో వినకూడదని తప్పించుకొని ఖిల్లా గుట్టకు వెళ్లే ఘట్టం ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

- ఊట్కూర్/కోయిలకొండ

6

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

- ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులకు గాను ఆదివారం సాయంత్రం నాటికి 23 అడుగులకు చేరిక

7

అమెరికాలో తెలంగాణ పోలీసుకు గోల్డ్ మెడల్

- హైదరాబాద్ డీజీపీ ఆఫీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా కృష్ణారావు విధులు

గోపాల్‌పేట, జూలై 6(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ అమెరికాలో బంగారు పతకాన్ని సాధించారు. అమెరికాలోని అలబామాలో జరుగుతున్న వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌లో తెలంగాణ పోలీసు సత్తా చాటారు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన పసుపుల కృష్ణారావు హైదరాబాద్ డీజీపీ ఆఫీస్‌లో హెడ్ కానిస్టేబులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్పోర్ట్స్ విభాగం తరపున ఆయన అమెరికాలో ఇండోర్ రోయింగ్ గేమ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ పోటీల్లో 80 దేశాల నుంచి దాదాపు 8,500 మంది పాల్గొన్నారు. 50 ప్లస్ విభాగంలో మన దేశం నుంచి ఇండోర్ రోయింగ్ గేమ్‌లో పసుపుల కృష్ణారావు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుద్దారం గ్రామస్థులు ఆయన ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.



గోల్డ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ కృష్ణారావు

పెద్దవాగు నుంచి ఇసుక పోనివ్వం

- తీర్మానించిన మాగనూరు గ్రామస్థులు
- అక్రమ రవాణాకు అధికారులు సహకరించడం సరికాదని వెల్లడి

7

కలుషిత నీటితో చేపలు మృతి

- రూ.50 లక్షల ఆస్తి నష్టం
- నవాబ్‌పేటలో ఘటన

నవాబ్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నీరు కలుషితమై చేపలు మృతి చెందిన సంఘటన నవాబ్‌పేట మండలం లింగంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో కొర్ర మట్టల చేపల పెంపకాన్ని చేపట్టాడు. వారం రోజులుగా నీళ్ల కలుషితం కావడంతో సుమారు పది టన్నుల విలువ చేసే చేపలు మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. వారం రోజుల క్రితం వేంకటేశ్వరతండాలో లింబ్యానాయక్‌కు చెందిన చేపలు మృతిచెందిన విషయం తెలిసిందే.



మృతి చెందిన చేపలు

'పేట' జిల్లాకు రెండు ప్రభుత్వ పాఠశాలలు

- మక్తల్ మండల కేంద్రానికి మంజూరు చేసిన ప్రభుత్వం
- మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో..
- మక్తల్ బీసీ కాలనీ, జగ్జీవన్‌రామ్ కాలనీల్లో ఏర్పాటుకు చర్యలు

నారాయణపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్‌కు ప్రభుత్వం రెండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మంజూరు చేసింది. గత నెలలో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన ఎంఈఓల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 20 మంది విద్యార్థులు ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. దాంతో విద్యాశాఖ అధికారులు సర్వే చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం మక్తల్‌కు రెండు పాఠశాలలను మంజూరు చేసింది. ఐదో వార్డు బీసీ కాలనీలో బాలురు 24 మంది, బాలికలు 13 మంది కలిపి 37 మంది, తొమ్మిదో వార్డు జగ్జీవన్‌రామ్ కాలనీలో బాలురు 16 మంది, బాలికలు 15 మంది కలిపి మొత్తం 31 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటవ తరగతిలో ప్రవేశాలు కల్పించి పాఠశాలలు ప్రారంభించనున్నారు. ఆయా పాఠశాలల్లో ఫర్నిచర్, అకాడమిక్, స్టేషనరీ తదితర సామగ్రి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. పాఠశాలల కోసం భవనాలను గుర్తించి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నారు.

విద్యనభ్యసిస్తున్న 52,762 మంది విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 334, ప్రాథమికోన్నత పాఠశాలలు 85, ఉన్నత పాఠశాలలు 76, కస్తూర్బాలు 11 ఉన్నాయి. మక్తల్ మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా కొత్త వాటితో 61 కానున్నాయి. జిల్లాలో 52,762 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

పెంపుడు జంతువులకు రేబిస్ నిరోధక టీకాలు

- ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఉచితంగా అందజేత

నారాయణపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఆదివారం నారాయణపేటలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ అనిరుద్ఆచార్య మాట్లాడుతూ జునోటిక్ రోగాలంటే పశువుల నుంచి సంక్రమించే రోగాలని తెలిపారు. ఈ రోగాల్లో అతి ముఖ్యమైనది రేబిస్ అని, ఇది కుక్క లేదా పిల్లి కాటు వల్ల మనుషులకు సంక్రమిస్తుందని చెప్పారు. పెంపుడు జంతువుల్లో రేబిస్ తొలగించేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు.



ఊట్కూర్‌లో హసన్- హుస్సేన్ పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కోయిలకొండలో పీర్ల ఊరేగింపును తిలకిస్తున్న భక్తులు, ప్రజలు

ముగిసిన మొహర్రం

● ఊట్కూర్, కోయిలకొండలో ఘనంగా వేడుకలు

● తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలొచ్చిన భక్తులు

ఊట్కూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్, కోయిలకొండలలో మొహర్రం ఉత్సవాలు ఆదివారం చివరి రోజు కన్నుల పండువగా నిర్వహించారు. పీర్ల సవార్లలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. ఊట్కూర్‌లో హసన్, హుస్సేన్ పీర్ల పగలు సవారి తెల్లవారుజామున 5 గంటలకు ప్రారంభమైన గ్రామంలోని వీధుల గుండా తిరుగుతూ 10 గంటలకు తిరిగి పీర్ల మసీదుకు చేరింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన రాత్రి సవారి 10 గంటల ప్రాంతంలో చెరువు కట్ట అలుగు వద్దకు చేరుకోవడంతో ఉత్సవాలు ముగిశాయి. వేడుకలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు తరలొచ్చారు. దాంతో పీర్ల మసీదు ప్రాంతం శనివారం రాత్రి నుంచే భక్తులతో కిగకిటలాడింది. పొట్టేళ్ల కోసి, మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు వెండి ఊయలలు, దట్టీలను, పూల చాదర్లను సమర్పించారు. తమ్ముడు హుస్సేన్ వెంట అన్న హసన్ పీర్లు వెళ్తుండగా దారి పొడవున భక్తులు కాళ్లకు నీళ్ల పోస్తూ దీవెనలు పొందారు. నారాయణ పాఠశాల సమీపంలో పీర్లను ఎత్తే వారి వంశంలో పుట్టిన మగబిడ్డను ఊయ్యలలో వేసి ఊపే ఘట్టం ఆకర్షణగా నిలిచింది. ఈ ఘట్టాన్ని చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. రాత్రి సవారి ఊరేగింపు అనంతరం పెద్ద చెరువు వద్ద ఉత్సవాలు ముగిశాయి. ప్రాణత్యాగం చేసిన హసన్- హుస్సేన్‌లతో పాటు మృతి చెందిన తమ కుటుంబ సభ్యులను తలుచుకుని మహిళలు విలపించారు. చెరువు కట్ట అంచున ఉన్న రోషన్ అలీ దర్గాను భక్తులు దర్శించుకుని ఫాతియాలు ఇచ్చారు. పలువురు రాజకీయ నాయకులు పీర్లను దర్శించుకున్నారు. పులిమామిడి, పెద్దజట్రం, నిడుగుర్తి గ్రామాల్లో సైతం పీర్ల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నారాయణపేట డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ రాంలాల్‌తో ఊట్కూర్‌లో భద్రతను పర్యవేక్షించారు.



ఊట్కూర్‌లో బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ రాంలాల్

కోయిలకొండలో కోలాహలం

కోయిలకొండలో 9 రోజులుగా నిర్వహించిన మొహర్రం ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. తెల్లవారుజామున బీబీ ఫాతిమకు ప్రభుత్వం తరఫున చక్కెర అందించారు. అనంతరం ఊరేగింపు కోసం బీబీ ఫాతిమా పీరును ఖిల్లా నుంచి కిందకు తీసుకొచ్చారు. పాత పోలీస్‌స్టేషన్ వద్ద అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చూసేందుకు భక్తులు శనివారం రాత్రికే చేరుకున్నారు. అగ్నిగుండం కార్యక్రమం పూర్తి కాగానే ఉషన్‌పాష, చాన్‌దూల తోపాటు మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన పీర్లు బీబీ ఫాతిమను దర్శించుకొన్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎక్కడ చూసినా మహిళల బీబీ ఫాతిమా బొడ్డెమ్మ పాటలు, అలయ్ ఆటలు కనిపించాయి.

ఆకట్టుకొన్న సవారీలు..

చివరి రోజు పీర్ల సవార్లు ఆకట్టుకొన్నాయి. బీబీ ఫాతిమ భర్త మొగులాలు యుద్ధంలో మృతి చెందిన విషయాన్ని వార్ల గండెల్‌సాబ్ పీరు ఫాతీమా పీరు వద్దకు వచ్చి చెప్పే సందర్భంలో ఫాతిమ పీరు భర్త మరణవార్త చెవులతో వినకూడదని తప్పించుకొని ఖిల్లా గుట్టకు వెళ్లే ఘట్టం ఆకట్టుకొంది. ఉషన్‌పాష, చాన్‌దూల, పారుపల్లి, ఇబ్రహీంనగర్, తెలుగు వీధి పీర్ల సవార్లు డప్పు వాయిద్యాల మధ్య అలరించాయి. ఎస్‌ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పేటలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

నారాయణపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, జనసంఘ్ నాయకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి, మొదటి దళిత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ల వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్‌కుమార్‌లు మాట్లాడారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అఖండ భారతం కోసం పరితపించి జీవితాంతం కృషి చేశారన్నారు. దేశ మొదటి దళిత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం నేడు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. బీజేపీ జిల్లా నాయకులు నందునామాజీ, రఘురామయ్యగౌడ్, సిద్ధి వెంకట్రాములు, వెంకటయ్య, నగేష్, గోపాల్‌యాదవ్, సత్యనారాయణ, రమేష్, మొగులప్ప, చేతన్, సైదప్ప, కిరణ్, ఉమాకాంత్ తదితరులున్నారు.

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి

● ఆగస్టు 25, 26వ తేదీల్లో ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రథమ మహాసభలు

● న్యాయవాది దామోదరరావు



మాట్లాడుతున్న ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, న్యాయవాది దామోదరరావు

పాలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రైతులను దోపిడీకి గురిచేసే కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, న్యాయవాది దామోదరరావు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలు ఆగస్టు 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, ప్రభాకర్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రాంచందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా న్యాయవాది దామోదరరావును ఎన్నుకున్నారు. ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకులు రాము, సీహెచ్ రాంచందర్, రాజన్న, యాదగిరి, భగవంతు, వెంకటేష్, అరుణ్‌కుమార్, సాంబశివుడు, సలీం, కాశీనాథ్, జయలక్ష్మి, హనుమంతు, కాలేశ్వర్, టీపీటీఎఫ్ నాయకులు దేవేందర్, రామకృష్ణ, సీతారం, సుభాష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

పండుగ సాయన్న ఆశయాలు సాధిద్దాం



ధర్మపూర్‌లో పండుగ సాయన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఆనాడు దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకోవాలి మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పండగ సాయన్న నవల రచయిత, సీనియర్ అడ్వకేట్ బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం పండుగ సాయన్న జయంతిని మండలంలోని ధర్మపూర్‌లో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహానికి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, ముదిరాజ్ సహాసభ ఆధ్వర్యంలో పండుగ సాయన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు ప్రభాకర్, కృష్ణ, మైత్రి యాదయ్య, యాదయ్య, వెంకట్‌రాములు, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : పెత్తందారులను ఎదిరించి పేదలకు అండగా నిలిచిన పండుగ సాయన్న ఆశయాలను సాధిద్దామని సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సిములు, మార్కెట్ చైర్మన్ హరలింగం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకటస్వామి రాజు, నర్సిములు, గోపాల్, సత్యం, ఆనం ద్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ వైభవం కోసం..

● చెంచుల ఎదురుచూపులు

» ఇన్‌చార్జి పీవోతోనే 11ఏళ్లుగా నడుస్తున్న ఐటీడీఏ

» అధికారులు, సిబ్బందిని నియమించాలని చెంచుల విన్నపం

» నేడు మన్ననూరులో పర్యటించనున్న రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నాగర్‌కర్నూలుకు మార్చిన డీటీడీవో కార్యాలయ బోర్డు మన్ననూరులో..

మన్ననూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సున్నిపెంటలో ఉన్న అప్పటి ఐటీడీఏలో ఉన్న విధంగా ప్రస్తుతం పూర్వ వైభవం తీసుకురావాలని ఆదివాసీ చెంచులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులో ఏర్పాటైన ప్రత్యేక ఐటీడీఏకు పీవోతో పాటుగా పూర్తి అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సోమవారం అమ్రాబాద్ మండలం మన్ననూరులో చెంచులకు ఇందిరమ్మ పథకం ప్రొసీడింగ్ పత్రాల పంపిణీతో పాటుగా ఇతర అభివృద్ధి పనుల ప్రారంభానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దృష్టికి స్థానిక ఆదివాసీ చెంచులు పలు సమస్యలను విన్నవించి, ప్రభుత్వం ద్వారా పరిష్కారం చేసుకుందామని ఆశతో ఉన్నారు.

సమస్యలివిగో..

2014లో ఐటీడీఏ ఏర్పాటైన తర్వాత దీనిని మన్ననూరుకు తీసుకువచ్చినా రెగ్యులర్ పీవోను నియమించలేదు. ఇన్‌చార్జి పీవోతోనే నడిపిస్తున్నారు. ఒకే ఒక సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. ఐటీడీఏలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి తదితర అనుబంధ శాఖ ల అధికారులను నియమించాల్సి ఉంది. మన్ననూరుకు ఐటీడీఏ రాక ముందు మాడా కార్యాలయం ఉండేది. మాడాను జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంగా మార్చారు. మన్ననూరులో కార్యాలయం ఉండగా అధికారులు మాత్రం జిల్లా కలెక్టరేట్‌లోని ఓ భవనం నుంచి గడిచిన మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాన్ని మన్ననూరులోనే నిర్వహించాలని చెంచు గిరిజనులు పలు మార్లు విన్నవించినా ఉన్నతాధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి ఏపీలోని ఐటీడీఏలో చెంచు గిరిజనులకు ట్రైకార్ ద్వారా ప్రత్యేక సబ్సిడీ రుణ సౌకర్యం, కాడెద్దుల పంపిణీ పథకం, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాల పంపిణీ పథకాలు ఉండేవి. ఇప్పుడవేవీ అమలు జరుగడం లేదని చెంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెంచులను గతంలో ఐటీడీఏ పాలకమండలిలో సభ్యులుగా చేర్చుకొని సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పథకాలు అమలు చేసేవారు. అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతో బాధపడుతున్న చెంచులకు నిమ్స్‌కు తరలించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించే వారు. ఇప్పుడా సౌకర్యం లేదని చెంచులు వాపోయారు.

సోమవారం పర్యటించే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారానైనా తమ సమస్యలకు పరిష్కారం దొరికి మన్ననూరు ఐటీడీఏకు రెగ్యులర్ పీవోతో పాటుగా, పూర్తి స్థాయి అధికార యంత్రాంగాన్ని నియమించి ఐటీడీఏకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వపు వైభవాన్ని తీసుకువస్తుందని స్థానిక చెంచులు ఆశలు పెట్టుకుంటున్నారు.

నేడు నల్లమలలో మంత్రుల పర్యటన

నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులో రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంత్రి సోమవారం ఉదయం 8గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి ఉదయం 10:30 గంటలకు మన్ననూరు మృగవాణి గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారన్నారు. అక్కడే రెవెన్యూ అంశాలపై అధికారులతో చర్చిస్తారన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి అమ్రాబాద్ పీడబ్ల్యూడీ రోడ్డు, గిరిజన భవనం ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం ఆదివాసీ చెంచు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారని తెలిపారు.

ఐటీడీఏ ద్వారా రాజీవ్ యువ వికాసం రుణాలివ్వాలి

గత 10ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చెంచులకు ప్రత్యేక సబ్సిడీ రుణ సదుపాయం ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఐటీడీఏకు ప్రత్యేక యూనిట్లను కేటాయించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. జిల్లా కేంద్రంలో నడుస్తున్న డీటీడీవో కార్యాలయాన్ని మన్ననూరులోనే నిర్వహించాలి

- దాసరి రాజేంద్ర ప్రసాద్, చెంచు సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

జర్నలిస్టుల పోరాట పటిమ ప్రశంసనీయం

» నివాస గృహాల కోసం సీఎం దృష్టికి తీసుకువెళ్తాం

» ప్రభుత్వం దృష్టికి కొల్లాపూర్‌లో జర్నలిస్టుల దీక్షలు

» టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య



కొల్లాపూర్‌లో జర్నలిస్టుల రిలే దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

కొల్లాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్‌లో రెండు వారాలుగా ప్రభుత్వపరంగా నివాస స్థలాలు, గృహాల కోసం ఉద్యమిస్తున్న జర్నలిస్టుల పోరాట పటిమ ప్రశంసనీయమని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి, జిల్లా నాయకులు ఎస్పీ మల్లికార్జున్ సాగర్, సీనియర్ జర్నలిస్టులు కురుమయ్య, కారంగి గోవిందు, కళ్లెపు భాను ప్రకాష్, రామకృష్ణ, కేశవులు, నరేష్, రాము, మల్లేష్ తదితరులు 12వ రోజు ఆదివారం దీక్షలు కొనసాగించారు. దీక్షలకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్ మద్దతు ప్రకటించారు. బసవ పున్నయ్య మాటాడుతూ రాష్ట్రంలో, జిల్లా, నియోజకవర్గాలు, మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి గతంలో ఉన్న ప్రభుత్వాలు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రకటించిందన్నారు. అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని, రైల్వే పాసుల కోసం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని చాలా సందర్భాల్లో కలిసి వినతిపత్రాలు ఇచ్చామని, జర్నలిస్టుల పక్షాన ధర్నాలు చేపట్టామని గుర్తు చేశారు. పోరాటాలతోనే సమస్యలు ప్రభుత్వాలకు తెలియజేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్, గౌడ సంఘం జిల్లా నాయకులు చందన్‌గౌడ్, ప్రముఖ న్యాయవాది నిరంజన్, మాదిగ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కారంగి నరసింహ, వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సంతబజారులో ఊరేగిస్తున్న పీర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం పర్వదిన వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సంతబజారు, నాగనూలు, ఎండ్లబెట్ల, దేశిటిక్యాల, ఉయ్యాలవాడ తదితర ప్రాంతాల్లో వారం రోజులుగా పూజలందుకున్న పీర్లు ఆదివారం సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని సంతబజారులో ఏర్పాటు చేసిన పీర్లు చివరి రోజు ఆదివారం తెల్లవారుజాము నుంచి బ్యాండు మేళా, డప్పు చప్పుళ్లతో ఇంటింటికి తిరిగి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు సంతబజారుకు ఊరేగింపుగా వచ్చిన పీర్లను మతాలకు అతీతంగా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల వద్ద బ్యాండ్ మేళాకు యువత నృత్యాలతో సందడి చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

» జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

ఊర్కొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. మండలంలోని తిమ్మన్నపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శేఖర్ నాయనమ్మ బాలమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా రాచాలపల్లి గ్రామానికి చెందిన మాడ్గుల రాజు ఆదివారం ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు అరవింద్‌గౌడ్, దివాకర్‌గౌడ్, మహేందర్, చిన్నా తదితరులు ఉన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బందికి ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థికంగా ఉండగా నిలిచేందుకు ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించడమనేది రాజ్యాంగ బద్ధ హక్కు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లించాలని ఆయన కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, బన్నీ, అఖిలాష్, ఉదయ్ అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

సీఏలో ప్రతిభ కనబరిచిన మోహన్



మానవపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆదివారం ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో మానవపాడు గ్రామానికి చెందిన కురువ కృష్ణ కుమారుడు మోహన్ జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించినట్లు కుటుంబీకులు తెలిపారు. అఖిల భారత స్థాయిలో కేవలం 50 ర్యాంకులు మాత్రమే ప్రకటిస్తారని, వాటిలో మోహన్ 26వ ర్యాంక్ సాధించడం గౌరవంగా ఉందని, రైతు కుటుంబంలోని మోహన్ ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

డీడీలు కట్టిన రైతులకు విద్యుత్ కనెక్షన్లు

» విద్యుత్ శాఖ ఎస్ఈ సీహెచ్ బాలరాజు

కందనూలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీడీలు కట్టిన రైతులకు సీనియార్టీ ప్రకారం విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సీహెచ్ బాలరాజు ఆదివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ డివిజన్‌లోని కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రైతులు డీడీలు కట్టిన వారందరికీ విద్యుత్ కనెక్షన్లతో పాటు అన్ని రకాల పరికరాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. 11కేవీ పనులు పూర్తైన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి రైతులకు కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కరెంటు కనెక్షన్ కోసం డీడీలు కట్టిన రైతులకు మెటీరియల్ ఎప్పటికప్పుడు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో 148 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించినట్లు ఆయన తెలిపారు. 200 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. డీఈ శ్రీధర్‌శెట్టి మాట్లాడుతూ 11కేవీ పనులు కొనసాగుతున్నాయని, పూర్తయిన వెంటనే రైతులకు అందజేస్తామని తెలిపారు.

తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తుల రద్దీ తగ్గింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం భక్తుల రద్దీ తగ్గింది. తొలి ఏకాదశి ఉండటంతో భక్తులు తగ్గారు. భక్తుల నుంచి టి కెట్ల ద్వారా రూ.17,020, హుండీ ద్వారా రూ. 66,685, మొత్తం 830,75 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

క్రైం కార్నర్

రైలులో నుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

అలంపూరుచౌరస్తా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలంలోని జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలో రైలులో నుంచి కింద పడి ఓ ప్రయాణికుడు గాయాలపాలయ్యాడు. మహబుబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం, కారుకొండ గ్రామానికి చెందిన నరేందర్, గ్రామస్థులతో కలిసి తిరుపతికి పయనమయ్యాడు. ఆదివారం వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. పోతులపాడు స్టేషన్ జోగుళాంబ హాల్ట్ మధ్య రైలు ప్రయాణిస్తుండగా వాకిలి వద్ద కూర్చున్న నరేందర్ నిద్రమత్తులోకి జారుకుని కిందపడిపోయాడు. దీంతో కాసేపు రైలు ఆగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తికి..

తిమ్మాజిపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని గుడ్ల నర్వ గ్రామానికి చెందిన సుదర్శన్ వ్యక్తి తిమ్మాజిపేటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఆటోను ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న కానిస్టేబుళ్లు శ్రీను నాయక్, రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన సుదర్శన్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఆసుపత్రికి వచ్చిన వారికి అతనిని అప్పజెప్పారు.

కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత

దామరగిద్ద, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా దామరగిద్ద కేజీబీవీ బాలికల విద్యాలయంలో విద్యార్థిని హరిత శుక్రవారం అస్వస్థతకు గురైంది. సమాచారం అందుకున్న వత్తుగుండ్ల గ్రామానికి చెందిన తల్లిదండ్రులు ఆదివారం నారాయణపేటలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా కేజీబీవీలో మరి కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ఈ విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వాతి మాట్లాడుతూ కొంత మందికి స్వల్ప జ్వరం రావడంతో ట్యాబ్లెట్లు ఇవ్వడంతో తగ్గిందని చెప్పారు. అస్వస్థతకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాచూరులో వ్యక్తిపై కత్తితో దాడి

వెల్దండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని రాచూరు గ్రామంలో శనివారం రాత్రి ఏపీలోని విశాఖపట్నానికి చెందిన చిలకమర్తి బాలసుబ్రమణ్యంపై ఓ వ్యక్తి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కొద్దిరోజుల క్రితం గ్రామానికి చెందిన దంపతులకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చిలకమర్తి బాలసుబ్రమణ్యం పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి బాలసుబ్రమణ్యంను దంపతులు తమ స్వగ్రామమైన రాచూరుకు పిలిపించారు. దీంతో గ్రామానికి వచ్చిన బాలసుబ్రమణ్యం రాత్రి పడుకున్న అనంతరం నీవు నా భార్య కోసమే వచ్చావని, వివాహేతర సంబంధం కలిగి ఉన్నావని ఆరోపిస్తూ ఇంట్లో ఉన్న కత్తితో భర్త దాడిచేసి మూడు చోట్ల గాయపరిచాడు. దీంతో బాలసుబ్రమణ్యం తీవ్ర గాయాలతో తప్పించుకోగా గ్రామస్థులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

గుప్త నిధుల కోసం పొలాల్లో తవ్వకాలు



పొలంలో తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రైతులు

కోడేరు, జూలై 6, (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో తవ్వకాలు జరపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో ఎత్తం గట్టు సమీపంలో ఉన్న శనివారం రాత్రి వట్టిల బాలస్వామి పొలంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేశారు. సమీపంలో నిమ్మకాయలు, అగరబత్తులు, కుంకుమ, పసుపు ఇతర వస్తువులను వేసి తవ్వకాలు ప్రారంభించినట్లు రైతు వట్టిల బాలస్వామి తెలిపారు. మూడు రోజుల కింద గుర్తు తెలియని వ్యక్తులు పొలాల చుట్టూ తిరిగినట్లు గమనించామని తెలిపారు. వారిలో ఒకరు గ్రామానికి చెందిన వారు కావడంతో వారిని పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై మాకు ఎలాంటి సమాచారం లేదని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

నల్లమలలో రిటైర్డ్ వాచర్ అదృశ్యం

» పది రోజులుగా లభించని ఆచూకీ

మన్ననూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలోని అప్పాపూర్ పెంటకు చెందిన చెంచు గిరిజనుడు రిటైర్డ్ అటవీ టైగర్ ప్రొటెక్షన్ వాచర్ తోకల మల్లయ్య అడవిలో పది రోజుల క్రితం అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. జూన్ 26న ఉదయం మల్లయ్య తనతో పాటుగా పెంపుడు కుక్కను వెంట పెట్టుకొని అప్పాపూర్ సమీపంలోని అడవిలోకి వెళ్లాడు. రెండు రోజుల తర్వాత కుక్క మాత్రమే పెంటకు తిరిగి రావడంతో అడవిలో ఎక్కడో చిక్కిపోయాడని భావించిన సహచర చెంచులు వెతికినా ఆచూకీ తెలియరాలేదు. మల్లయ్య తప్పిపోయిన విషయమై పోలీసులతో పాటుగా, అటవీ శాఖ అధికారులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

అందుబాటులోకి రానున్న ఆసుపత్రి?

» అలంపూర్‌చౌరస్తాలో రెండేళ్ల క్రితం నిర్మాణం
» హైకోర్టు ఆదేశాలతో పరికరాల ఏర్పాట్లపై దృష్టి
» 20మంది సిబ్బందిని కేటాయించిన ప్రభుత్వం



అలంపూరు చౌరస్తాలో నిర్మాణం పూర్తయిన వంద పడకల ఆసుపత్రి

అలంపూరు చౌరస్తా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌చౌరస్తాలో రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న వంద పడకల ఆసుపత్రి త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రూ.21కోట్లతో 20నెలల్లో పనులు పూర్తి చేశారు. పనులు పూర్తయ్యాక గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 అక్టోబర్‌లో అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం, పలువురు నాయకులు కలిసి ఆసుపత్రిని ప్రారంభించారు. దీంతో చెంతనే మెరుగైన వైద్యం అందుతుందని అలంపూర్ నియోజకవర్గ ప్రజలు ఆశపడ్డారు. నాటి నుంచి నేటి వరకు ప్రజలు ఎదురు చూడటం తప్పా కొత్త ఆసుపత్రి వినియోగంలోకి రాలేదు. కాగా హైకోర్టు ఆదేశాలతో త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నదని అధికారులు చెబుతున్నారు.

ఆసుపత్రి కోసం ఆది నుంచి ఆందోళనలే..

వంద పడకల ఆసుపత్రి మంజూరు దగ్గర నుంచి నేటి వరకు ఆందోళనల పర్వం నడుస్తూనే ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మెరుగైనవైద్యం కోసం నడిగడ్డ ప్రజలు పొరుగున ఉన్న కర్నూలును ఆశ్రయించేవారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్తే అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై నడిగడ్డ ప్రజలకు మెరుగైన వైద్యం కరువైంది. ఈ అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే అబ్రహం చొరవ తీసుకుని వందపడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.21కోట్లు మంజూరు చేయించారు. మొదట అలంపూరు పట్టణంలో నిర్మించాలని ప్రజల నుంచి డిమాండ్లు వచ్చాయి. అయితే దేశంలోనే అతిపెద్ద 44వ జాతీయ రహదారి ఉండటంతో నియోజకవర్గ ప్రజలకే కాక రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు కూడా త్వరితగతిన చికిత్స అందించవచ్చన్న ఉద్దేశ్యం, భవిష్యత్‌లో ఇదే ఆసుపత్రి ట్రామాకేర్ సెంటర్‌గా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన వనరులు ఉండటంతో అలంపూర్ చౌరస్తాలో నిర్మించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు అసెంబ్లీలో, ఎమెల్సీ చల్లా మండలిలో ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో తేవాలని డిమాండ్ చేశారు. చివరికి బీజేపీ జిల్లా మాజీ అద్యక్షుడు రామచంద్రారెడ్డి ప్రజాప్రయోజనవ్యాజ్యం కింద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయస్థానం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండువారాల్లో సమాధానం ఇవ్వాలని వారంరోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక మొదలైంది. ఇప్పటికే ఆసుపత్రి నిమిత్తం 20 మంది సిబ్బందిని కేటాయించారు. ఇందులో 8 మంది ప్రతీ రోజు డ్యూటీ నిమిత్తం వచ్చి వెళ్తున్నారు.

గతంలో సామగ్రి చోరీ

ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వెంటనే గత ప్రభుత్వం అవసరమైన సామగ్ని కొన్నివారాల్లోనే ఆసుపత్రికి చేర్చింది. ఏళ్లు గడిచిపోతున్న వినియోగంలో లేకపోవడంతో ఆ ప్రాంతమంత ఆకతాయిలకు అడ్డాగా మారింది. కొందరు దుండగులు పలుమార్లు ఆసుపత్రికి ఉన్న గ్రిల్స్ తొలగించి విలువైన సామగ్రిని దొంగిలించారు. ఈ విషయంపై ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ సయ్యద్‌బాష ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి జిల్లా అధికారులు నలుగురు సిబ్బందిని నియమించి కాపలా కాస్తున్నారు.

ప్రారంభానికి మరో రూ.కోటి అవసరం

ఇప్పటికిప్పుడు ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలంటే కనీస సిబ్బంది అవసరం. ప్రస్తుతం గైనకాలజిస్టులు ఐదుగురు, ఫిజీషియన్ ఇద్దరు, చిన్నపిల్లల డాక్టర్లు ఐదుగురు, ఎంబీబీఎస్ ఆరుగరు, పీడీయాట్రిక్స్ డాక్టర్లతో పాటు శానిటేషన్ సిబ్బంది 30మంది, సిస్టర్లు 15మంది, ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే సిబ్బంది, ఎంఎన్‌వోస్, ఎఫ్ఎన్‌వోలు ముగ్గురేసి చొప్పున సుమారు వందమంది సిబ్బంది ఉండాలి. సిబ్బందితో పాటు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో మత్తుపరికరాలు, ఆటోక్లేవ్ పరికరాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, పల్స్ బీపీ మానీటర్‌లు, మార్చురీలో చాంబర్స్ ఏర్పాటుతో పాటు డోర్స్ మరమ్మతులు, రెయిన్ ఒపెన్ టు స్కైతో వర్షం వస్తే నేరుగా వర్షం నీరు కిందపడుతుంది మరమత్తులు చేయించాల్సి ఉంది. వీటన్నింటికి సుమారు రూ. కోటి వరకు నిధులు అవసరమని తెలుస్తుంది.

ఈ నెలలో ప్రారంభం కావచ్చు



అలంపూరుచౌరస్తాలో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి ఈ నెలలోనే వినియోగంలోకి రావచ్చు. ఇందుకోసం ప్రస్తుతం 20మంది సిస్టర్లను పంపారు. వారిలో 8 మంది విధులకు హాజరవుతునారు. మిగతా వారు గద్వాల, అలంపూరు ఆసుపత్రులలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకా అవసరమైన సిబ్బందిని, మరికొన్ని పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరితగతిన ఆసుపత్రిని వినియోగంలోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నా రు.

- రమేష్‌చంద్ర, ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్

ప్రాణాలు పోతున్నాయి



స్థానికంగా మెరుగైన ఆసుపత్రి, వైద్యులు లేక అత్యవసర పరిస్థితిలో కర్నూలు, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తుంది. ప్రాణాపాయస్థితిలో సమయానికి చికిత్స అందాక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఇంకా ఎక్కువ ఉంది. ఆసుపత్రిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

- రాముడు,
కలుకుంట్ల గ్రామం, మానవపాడు

పెద్దవాగు నుంచి ఇసుక పోనివ్వం

» తీర్మానించిన గ్రామస్థులు



మాగనూరులో సమావేశమైన రైతులు, నాయకులు

మాగనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని 167వ జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద ఉన్న ఇసుకను కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇవ్వబోమని గ్రామస్థులు, రైతులు, నాయకులు ఆదివారం హైస్కూల్ వద్ద సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అవసరమైన పైపులను తయారు చేసేందుకు మక్తల్ మండలం కాచువారు శివారులో ఉన్న కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇసుక అవసరమ ఉన్నదని యజమానులు రెవెన్యూ, పోలీస్ శాఖల ద్వారా ఇసుకను తరలించాలనే ఉద్దేశంతో ఉన్నారని మండిపడ్డారు. అధికారులకు విషయం వివరించినా పట్టించుకోకుండా ఏకపక్షంగా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తుండటం ఎంత వరకు సమంజసమని తెలిపారు. సమావేశంలో ఆనంద్‌గౌడ్, నరసింహరెడ్డి, కృష్ణయ్య, నారాయణరెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, గడ్డం నరేష్, దండు బసవరాజ్, బాల్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో సాయి ప్రసాద్ యాదవ్ తన అనుచరులతో పార్టీలో చేరారు. వారికి నిరంజన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఆ పార్టీలో ఉన్న కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలే విమర్శిస్తున్నారని తెలిపారు. ఒకటి, రెండు హామీలకు కూడా అడ్డగోలు నిబంధనలు పెట్టి పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం, రూ.4వేలు పెన్షన్, కౌలు రైతులకు భరోసా, మహిళలకు రూ.2,500 వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టాలని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, కురుమూర్తి యాదవ్, మాణిక్యం, నాగన్న యాదవ్, కుమార్ యాదవ్, రాము పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌కు పెరుగుతున్న నీటిమట్టం



కోయిల్‌సాగర్‌లో నిల్వ ఉన్న నీరు

దేవరకద్ర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టులోకి జూరాల నీరు వచ్చి చేరడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా ఆదివారం సాయంత్రం నాటికి 23 అడుగులకు చేరింది. మరో 9.5 అడుగులు నీరు వచ్చి చేరితే పూర్తి స్థాయిలో నిండుతుంది. నీరు వచ్చి చేరడంతో ఆయకట్టుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కింద రైతులు వరి పంటలను సాగు చేసుకుంటున్నారు.

సుంకేసులకు 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోలి : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంకు ఆదివారం వరద రావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. ఉదయం డ్యాంకు ఎగువ నుంచి 72 వేల క్యూసెక్కులు వస్తుండటంతో 17 గేట్ల ద్వారా 61వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం వరద కాస్త తగ్గి 65,200 క్యూసెక్కులు వస్తుండటంతో దిగువకు 67,200 క్యూసెక్కుల వరదను దిగువకు వదిలేస్తున్నట్లు డ్యాం జేఈ స్వామి తెలిపారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.50 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

పెంపుడు జంతువులతో మనస్సుకు ఉల్లాసం



కుక్కకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్

పాలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో కుక్కలు, ఇతర పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేశారు. పెంపుడు జంతువుల ఆరోగ్యం కోసం పశువైద్యుల సూచనలు పాటించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్థక అధికారి మధుసూదన్‌గౌడ్ సూచించారు. ప్రతీ ఏడాది జూలై 6వ తేదీన ప్రపంచ వ్యాప్తంగ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల దినోత్సవం పాటిస్తారని తెలిపారు. బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంద్రాలు ద్వారా, పశువుల ఉత్పత్తుల ద్వారా మానవులకు వ్యాధులను తీసుకెళ్తాయని వివరించారు. పెంపుడు కుక్కలు, పిల్లులు పెంచుతున్న ప్రతీ యజమాని ఏడాదికి ఒకసారి యాంటీ రేబిస్ టీకాలు విధిగా వేయించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో 200 పశువులకు రేబిస్ టీకాలు టీకాలు వేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా క్రీడాకారులు రంజి జట్టుకు ఎదగాలి
» జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి



ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుతో ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో జరగనున్న హెచ్‌సీఏ 2డే లీగ్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు తరలివెళ్లింది. ఆదివారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ 2డే లీగ్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని, రంజి జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహించేందుకు జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 2డే, వన్‌డే టోర్నీ నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తుది జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, అబ్దుల్లా, ముక్తార్ పాల్గొన్నారు.

జట్టు వివరాలు..

ఏ.శ్రీకాంత్(కెప్టెన్), అబ్దుల్‌రాఫె బిన్ అబ్దుల్లా, మహ్మద్ షాదాబ్‌అహ్మద్, మహ్మద్ ముఖిదుద్దీన్, జయసింహ, కే.శ్రీకాంత్, బీ.అక్షయ్, బీ.సంజయ్, ఎన్. ఛత్రపతి, ఎం.రామ్‌చరణ్, నసనిగాగన్, జీ.శశాంక్, ఏ.హర్షిత్, జీ. కేతన్‌కుమార్, కే. అక్షయ్, జీ. జశ్వంత్.

దేవాలయాలకు పోటెత్తిన భక్తులు

» శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
» వ్రతాలు ఆచరించిన భక్తులు



సోమశిలలోని లలితాంబిక సోమేశ్వర ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



ఉమామహేశ్వర ఆలయ పరిసరాల్లో భక్తులు



అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అలంపూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోటి లింగాలకు నిలయమైన బాల బ్రహ్మేశ్వర స్వామి, ఐదో శక్తి పీఠమైన జోగుళాంబ సన్నిధిలో తొలి ఏకాదశి, ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ఎత్తున భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం, అభిషేకం, జోగుళాంబ అమ్మవారికి త్రిశతి, ఖడ్గ మాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, చీరలు, నిమ్మకాయ హారాలు సమర్పించేందుకు గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో, అందులోనూ మొహర్రం కలిసి రావడంతో పుష్కర ఘాట్, షాలిపహిల్వాన్ దర్గా, ఉభయ ఆలయాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉమామహేశ్వరానికి పోటెత్తిన భక్తులు

అచ్చంపేట: ఉమామహేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనం కోసం గంటల కొద్ది క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దిగువన ఉన్న భోగమహేశ్వరం వద్దనే వాహనాలను పోలీసులు నిలిపివేశారు. కొండపైకి ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిచడంతో ఘాట్‌రోడ్డులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

లొద్ది క్షేత్రంలో భక్తుల సందడి

నల్లమల అభయారణ్యంలో వెలిసిన లొద్దిమల్లయ్య దర్శనానికి అటవీశాఖ ఆంక్షలను ఉపసహరించుకోవడంతో పెద్దఎత్తున భక్తులు తరలివెళ్లి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మార్మోగిన శివనామస్మరణ

కొల్లాపూర్: నల్లమల్ల అడవులు ఏరులై పారే కృష్ణానది సాక్షిగా తొలి ఏకాదశి సందర్భంగా కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామంలో శివ నామస్మరణ మార్మోగింది. సోమశిల గ్రామంలో పురాతన సోమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి సందర్భంగా లలితాంబిక సోమేశ్వర ఆలయం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. భక్తుల కోసం కొల్లాపూర్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

న్యూస్ బాక్స్

సీఎం నిర్ణయం హర్షణీయం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయం అని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 మంది విద్యార్థులు ఉన్న చోట పాఠశాల ఏర్పాటు చేయాలన్న నిర్ణయం సంతోషంగా ఉందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

పాలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఏర్పడి 32వ ఏడాదిలోకి అడుగుపెట్టడం, బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సింగిరెడ్డి పరమేశ్వర్, రమేష్, తిర్మలయ్య, రాములు, వినోద్ కుమార్, పెద్ద బాలయ్య పాల్గొన్నారు.

27న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు

జడ్చర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలను ఈనెల 27న జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్‌ఐఐసీ ప్రాంగణంలోని ఎస్వీకెఎం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది శ్రీనివాసులు వ్యవహరిస్తారని, ఉమ్మడి జిల్లాలోని హ్యాండ్‌బాల్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.

సగర సంఘం మండల కమిటీ ఎన్నిక

జడ్చర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండల సగర (ఉప్పర) సంఘం కమిటీని ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసాగర్, ప్రధానకార్యదర్శిగా వావిలాల శంకర్, కోశాధికారిగా చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ ముఖ్య అతిథిగా పాల్గొని, సగరులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. జీవో 59ను ఇచ్చి, రద్దు చేశారని, దీన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, గోపీనాథ్, సత్యంసాగర్, పర్వతాలు, రవిసాగర్, బుడ్డన్న, చంద్రమోహన్, సత్యం, ప్రశాంత్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆషాడ మాసంలో మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకోవడం ఆనాయితిగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని తువ్వగుట్ట బసవ భవన్‌లో నిర్వహించిన గోరింటాకు మహోత్సవంలో లింగాయత్ లింగ బలిజ మహిళా నాయకురాలు ప్రశాంతి, సుమిత్ర, భార్గవి గోరింటాకు వేడుకల్లో పాల్గొన్నారు.

ఎరుకల ఆరాధ్యదైవం ఏకలవ్యుడు

పాలమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎరుకల ఆరాధ్యదైవం ఏకలవ్యుడి జయంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం, ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మునిసిపల్ ఎన్నికల్లో ఎరుకలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో, ఆర్థికంగా ప్రభుత్వం ఎరుకలను ఆదుకోవాలన్నారు. ప్రత్యేకంగా గురుకులాల్లో సీట్లు కేటాయించాలన్నారు. మౌలాలి గుట్టలో ఎరుకల కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలన్నారు. శ్రీనివాసులు, కృష్ణయ్య, వెంకట్రాములు, నరసింహులు, బాలయ్య, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖర్‌నాయక్, బాలరాజు, సాయిలు, తిరుపతయ్య, అంజన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

మూసాపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల లేని పేదలకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగపడుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నందిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయంలో ఎవరికీ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల, రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఆరోపించారు. నాయకులు రావుల రాంరెడ్డి, ప్రవీన్‌కుమార్, గాలెన్న, ఖాదర్, మేకల భాస్కర్, శ్రీనివాస్, కొయ్య శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మూసాపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మండల అధ్యక్షుడు తోట శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం అడ్డాకుల మండలం పెద్దమునగాల్‌చేడ్, చిన్న మునగాల్‌చేడ్ గ్రామాల్లో ఉమ్మడి మండల సమన్వయ కమిటీ సభ్యులు పర్యటించి సమస్యలు తెలుసుకుని సమావేశం నిర్వహించారు. స్థా నిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, మూసాపేట మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి విజయ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కాటన్‌మిల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు



దర్శనం కోసం వస్తున్న భక్తులు



శాకాంబరి దేవీగా బంగారు మైసమ్మ అమ్మవారు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/దేవరకద్ర/జడ్చర్ల/మూసాపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాటన్‌మిల్ వేంకటేశ్వర స్వామి, పట్టణంలోని వీరన్నపేట రుక్మిణి పాండురంగస్వామి ఆలయానికి వేకువజామునుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి కొద్ది దూరంలోనే వాహనాలను పార్కింగ్ ఏర్పాటు చేయడంతో వాహనాలు నిలిపి భక్తులు దర్శనానికి వెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు తోటపల్లి శ్రీకాంత్ శర్మ, రుక్మిణి పాండురంగ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సంతోషాచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికొండ ఆంజనేయులు పాల్గొన్నారు. అదే విధంగా దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాలతో ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాస తొలి ఏకాదశి సందర్భంగా కావేరమ్మపేట లోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి ని శాకాంబరి దేవీగా అలంకరించి ప్రత్యేక పూజ లు చేశారు. జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి పాతబజారు రంగనాయకస్వామి గుట్టపై బాదేపల్లి మార్కెట్‌లోని దడవయి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదే విధంగా గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామికి ఆషాఢమాస తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి వారికి లక్ష పుష్పార్చన, మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, పుణ్యాహ వాచనము, రుత్విక్వరణము, మహిళలు లక్ష్మీదేవికి కుంకుమార్చన, ప్రథోషపూజ నిర్వహించారు. అదే విధంగా అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కురుమూర్తి ఆలయంలో లక్ష పుష్పార్చన



కురుమూర్తి వేంకటేశ్వరస్వామి

చిన్నచింతకుంట : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రదోషకాల పూజ, అఖండ భజన నిర్వహించారు. ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

» మొక్కులు తీర్చుకున్న భక్తులు » అలరించిన పీర్ల సవారి



పాత పాలమూరులో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



వెల్కిచర్లలో..

మహబూబ్‌నగర్ అర్బన్/భూత్పూర్/దేవరకద్ర/హన్వాడ/మిడ్జిల్/మూసాపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రత్యేకగా జరుపుకునే మొహర్రం పండుగ షహదాత్ రోజైన ఆదివారం జిల్లా వ్యాప్తంగా పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఇమామే హసేన్, హస్సేన్ పోరాట యోధులను స్మరించుకున్నారు. సాయంత్రం పాత పాలమూరు, టీడీగుట్ట పీర్ల మసీదు వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చి పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వన్‌టౌన్, పాత పాలమూరు ప్రధానవీధుల్లో పీర్లను ఊరేగించారు. పలు చోట్ల ముస్లిం యువకులు షర్బత్ పంపిణీ చేశారు. భూత్పూర్ మండల కేంద్రంతో పాటు పోతులమడుగు, కప్పెట, వెల్కిచర్ల, పాతమొల్గర, కొత్తమొల్గర, మద్దిగట్ల, కర్వెన తాటిపర్తి, తాటికొండ, అన్నసాగర్, భూత్పూర్, అమిస్తాపూర్ గ్రామాల్లో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకున్నారు. దేవరకద్ర మండలం గోపన్‌పల్లి, పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, కౌకుంట్ల మండల కేంద్రాల్లో పీర్ల వద్ద అలాయి ఆడారు. హన్వాడ, మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి, మిడ్జిల్, వాడియాల, కొత్తూరు, వెలుగొమ్ముల, చిలువేరు గ్రామాల్లో మొహర్రం సందర్భంగా భక్తులు పీర్ల వద్ద కందూర్లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బోయిన్‌పల్లి నుంచి పీర్లతో మిడ్జిల్, వాడియాల గ్రామానికి రావడంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ ఆధ్వర్యంలో అవాంచనీయ సంఘటన చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. మూసాపేట మండలం సంకలమద్ది, మహ్మద్ హుస్సేన్‌పల్లి, వేముల, నందిపేట, జానంపేట గ్రామాల్లో పీర్ల ఊరేగింపును చేశారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, జూలై 6 (ఆంధజ్యోతి) : మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహరెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, మహ్మద్‌ఖాజా, రాంచందర్, రాజుగౌడ్, అజీజ్, అలీ పాల్గొన్నారు.

● జడ్చర్ల : మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ ఆశయాలు కొనసాగిద్దామని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య పిలుపునిచ్చారు. బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలు స్మరించుకున్నారు. నాయకులు రఘురాంగౌడ్, సతీష్, శంకర్‌నాయక్, ఇంతియాజ్‌ఖాన్, కరాటే శ్రీను, బూర్గుపల్లి కృష్ణయాదవ్, తెలుగు సత్తయ్య, దీప్లానాయక్, భీంరాజ్, నిరంజన్, రంగయ్య ఉన్నారు.



జడ్చర్లలో..

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర నియోజవర్గంలోని వివిధ మండలాలకు పలువురు జిల్లా కేంద్రంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగయ్య బ్రెన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరడంతో పరామర్శించారు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన ఆంజనేయులుతో పాటు అంజిచారి కూతురు ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారికి పరామర్శించారు.

కళాకారులను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : హరికథా గానం ప్రోత్సహించి, కళాకారులను ఆదుకోవాలని హరికథా బిరుదాంకితుడు, రేడియో ఆర్టిస్ట్ గద్వాల కాశీ విశ్వనాథ్ భాగవతార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తువ్వగుట్టలోని బసవ భవన్‌లో పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా బసవేశ్వరుడి జీవిత చరిత్రను హరికథా రూపంలో గానం చేసే ముందు మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ లింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోకల శివుడు అధ్యక్షత వహించారు. గౌరవాధ్యక్షుడు వజ్రలింగం, పోకలు నాగభూషణం, జాజిమి చంద్రశేఖర్, సినీ నిర్మాత బద్రీనాథ్, పోకల మల్లేష్, నాగేష్, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/జడ్చర్ల/ భూత్పూర్/గండీడ్/హన్వాడ/మిడ్జిల్/నవాబ్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ గొప్ప విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, చెన్నవీరయ్య, రాజేందర్‌రెడ్డి, సత్యం, లక్ష్మమ్మ, సంపత్ కుమార్, లక్ష్మీనారాయణ, రాజు, మోహన్, నాగరాజు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. జడ్చర్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, గొల్లపల్లిలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, బాలకృష్ణ, సాహితిరెడ్డి, వెంకట్, బాలవర్ధన్‌గౌడ్, మురళీకృష్ణ, నవీన్, శ్రీను పాల్గొన్నారు. భూత్పూర్, హన్వాడ, గండీడ్ మండల కేంద్రాల్లో బీజేపీ మండల అధ్యక్షులు గూటం శ్రీనివాసులు, కొండ లింగన్న, విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు నర్సిములు, నాయకులు గాల్‌రెడ్డి, ఫారుక్, శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, హన్వాడ మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు బుచ్చిరెడ్డి, రమణారెడ్డి, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు నరసింహ, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వెంకటేష్, కిషన్‌మోర్చా ప్రెసిడెంట్ వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు. మిడ్జిల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ పాల్గొని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నరేందర్, ఆంజి, ప్రశాంత్, విష్ణు, మల్లికార్జున్, శివ పాల్గొన్నారు. నవాబ్‌పేటలో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం



సమావేశమైన బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

జడ్చర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్ పిలుపునిచ్చారు. జడ్చర్ల పట్టణంలోని చంద్రగార్డెన్స్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించి, ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులు, సహాయకార్యదర్శులు, కార్యదర్శులు సభ్యులతో పాటు క్రీడా కమిటీ, ఆర్థిక కమిటీ, సాంస్కృతిక కమిటీ, సావనీర్ కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. సలహామండలి సభ్యులుగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, పెద్ది పెంటయ్య, కాట్రేపల్లి లక్ష్మయ్య, పాలాది రాంమోహన్‌ను ఎన్నుకున్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య

హన్వాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు, రైతులు, రైతు కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆదివారం హన్వాడలో సమ్మె కర పత్రాన్ని విడుదల చేసి, మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 29 కార్మిక సంఘాల పిలుపుతో సమ్మె చేపట్టినట్లు తెలిపారు.

పోలేపల్లి సెజ్‌లోని గేట్ మీటింగ్

జడ్చర్ల : ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగి కృష్ణయ్య పిలుపునిచ్చారు. జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా కంపెనీల కార్మికులతో ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించి, మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాటం చేస్తుంటే, అందుకు భిన్నంగా కేంద్రం కార్మికుల చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

మహబూబ్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కోయిలకొండ మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుందని, కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన ఇసుక రవాణా ఆగడం లేదని సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో పగలు ఇసుక డంపలు చేసి రాత్రి వేళ అక్రమంగా భారత్‌బెంజ్ వాహనాలలో తరలిస్తున్నారని ఆరోపించారు. పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారంతోనే ఇసుక రవాణా సాగుతుందని, గతంలో పలుమార్లు ఈ విషయమై అధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం రెవెన్యూ అధికారులపై విచారణకు ఆదేశించినా అధికారులు అవేమీ పట్టించుకోకుండా ఇసుక రవాణాకు సహకరిస్తూనే ఉన్నారన్నారు. సూరారం, శేరి వెంకటాపూర్, మోదీపూర్ పెద్దవాగుల నుంచి ఇసుకను తీసుకొచ్చి ఆయా ప్రాంతాలలో డంప్ చేసి రాత్రివేళ నారాయణపేట, మహబూబ్‌నగర్‌కు తరలిస్తున్నారన్నారు. అధికారులు ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్లపైనే మాంసం విక్రయాలు



చిన్నచింతకుంటలో రోడ్డు పక్కనే మాంసం విక్రయిస్తున్న దృశ్యం

చిన్నచింతకుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మాంసం, చేపల విక్రయాలు యథేచ్ఛగా రోడ్లపైనే విక్రయిస్తుండటంతో స్థానికులు, ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా గ్రామంలో ప్రత్యేకించి మాంసం, చేపల విక్రయాలకు సంబంధించి ఆత్మకూరు, హైదరాబాద్ ప్రధాన రహదారిలోని బస్టాండ్ వద్ద విక్రయాలు కొనసాగడం గమనార్హం. ఈ క్రమంలో మాంసం విక్రయాల అనంతరం అక్కడ ఉండే వ్యర్థాలను తినేందుకు కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపైనే చేరి ప్రజలపై దాడులు కూడా చేస్తున్నాయి. ఒకానొక దశలో మాంసం కొనుగోలు దారుల నుంచి కూడా కవర్లు లాక్కొని వెళ్తున్నాయి. ఇదిలా ఉండగా ఈగలు, దోమలు బెడదతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే మండల కేంద్రంగా ఉన్నప్పటికీ గ్రామంలో మాంసం, కూరగాయలకు సంబంధించి ప్రత్యేక మార్కెట్ లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే వాటి విక్రయాలు జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కూరగాయల పంటలకు వింత తెగుళ్లు

» పెద్ద మొత్తంలో పాడైపోయిన కూరగాయల పంటలు » నష్టాల్లో రైతులు



కాకరకు వింత తెగులు సోకి పాడైపోయిన పంటను చూయిస్తున్న రైతు



పాడైపోయిన టమాట తోట

భూత్పూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల పంటలకు వింత తెగుళ్ల సోకడంతో ఆశించిన స్థాయిలో పంట చేతికి రాకపోవడం, పెట్టిన పెట్టుబడి కూడా రాక అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శేరిపల్లి (హెచ్) గ్రామంలో 80 శాతం మంది యువకులు కూరగాయలు, ఇతర వ్యవసాయ పంటల సాగులో రాణిస్తున్నారు. కాగా చాలా మంది రైతులు కాకర, బీర, వంకాయ, టమాట, బెండ, సోరకాయ, చిక్కుడు, పొట్లకాయ, గోకరకాయ వంటి కూరగాయలతో పాటు ఆకు కూరలు పండిస్తూ దగ్గరలోని పాలమూరు నగరంలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ సారి వేసవి కాలంలో సాగు చేసిన కూరగాయల పంటలకు వాతావరణ మార్పులతో వింత తెగుళ్ల సోకడంతో పెట్టుబడి కూడా రాని స్థితిలో ఏర్పడటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాలా నష్టం వచ్చింది..



నేను రెండెకరల్లో టమాట పంటను సాగు చేశాను. బాగా ఎండలు ఉన్న సమయంలో చాలా ఖర్చు పెట్టి అనంతాపూర్ నుంచి తీగ టమాట తాను తీసుకొచ్చి పంట వేశాను. అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పంట దెబ్బతిని, నష్టం వచ్చింది.

- బాలరాజు, రైతు శేరిపల్లి

ఎప్పుడు ఇలాంటి వైరస్ సోకలేదు..



నేను చాలా ఏళ్లగా మునగ తోటను సాగు చేస్తున్నా.. కానీ ఈ సారి మాత్రం మునగ తోటకు వింత వైరస్ సోకి పంట మొత్తం పాడైపోయింది. చాలా నష్టం వచ్చింది. పంట బాగా వస్తే అప్పులు తీరేవి.

- రఘునందన్‌రెడ్డి, రైతు, శేరిపల్లి